ప్రజాశక్తి
మంగళవారం 30 సెప్టెంబర్ 2025 5 అనంతపురం

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న నాయకులు

కాటికాపరులను వృత్తిదారులుగా గుర్తించాలి

కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

శ్మశానంలో గుంతలు తీసి మృతదేహాలను పూడ్చే, కాల్చే కాటి కాపరులను వృత్తిదారులుగా గుర్తించి గుర్తింపు కార్డు ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ. నల్లప్ప డిమాండ్ చేశారు. శ్మశానం లో మృతదేహాలకు గుంతలు తీసి పూడ్చే కాల్చే కాటి కాపరుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు తమ సమస్యలపై సోమవారం ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు ముఖ్య అతిథులుగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప హాజరయ్యారు కాటికాపర్ల సంఘం రాష్ట్ర నాయకులు జక్కిలి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జి వెంకటేష్, జిల్లా నాయకులు జీవరత్నం, రాము నాయక్, సూరి, ఆనంద్, ఏ.ఆంజనేయులు అక్కులప్ప, కసాపురం సుధాకర్, రామాంజనేయులు, వైటిచెరువు రాజశేఖర్, నెలగొండ కాశీం, మైనాపురం లక్ష్మన్న, గుండాల సుధాకర్, అమినేపల్లి మస్తాన్, పాత కొత్త చెరువు మహేష్, నల్ల దాసరిపల్లి సూరి, మొలకలపెంట పెద్దిరాజు కాటికాపర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప మాట్లాడుతూ ఎట్టోల్లుగా పిలువబడే కాటికాపరుల వృత్తి నేటికి ప్రభుత్వం దృష్టిలో ఒక వత్తిగా లేదు. ఈ వృత్తిలో దళితులైన మాల, మాదిగలు ఎక్కువ మంది ఉన్నారన్నారు. అన్ని రకాల వృత్తులను గుర్తించి సహకారం అందిస్తున్న ప్రభుత్వాలు ఈ వృత్తి గుర్తింపు, సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. రోజువారిగా తమ కుటుంబం కోసం కష్టపడే అదే కుటుంబసభ్యుడు చనిపోతే అప్పటిదాకా అప్యాయతగా చూసుకున్న ఆ కుటుంబమే చనిపోయిన తరువాత అంటుగా, ముట్టుగా భావించి, శవాన్ని ముట్టుకొనేందుకే బయపడ్డ కాలంలోనే కాటికాపరులు ఆచనిపోయిన వ్యక్తిని తాము తీసిన గుంతలో పూడ్చటమో, లేదా పేర్చిన కట్టెలపై పడుకోబెట్టి కాల్చడమో చేస్తున్నారన్నారు. ఈ వృత్తినితాత ముత్తాతల కాలం నుండి చేస్తువస్తున్నా ఈ వృత్తికి ఎలాంటి ఆదరణ గాని, గుర్తింపుగాని లేదని అన్నారు. మృతదేహాన్ని పూడ్చే సందర్భంగా అనేక రకాల వ్యాధులకు గురై అర్ధాంతరంగానే తనువు చాలిస్తున్న కాటికాపరులు ఉన్నారన్నారు. అనేక ఆటంకాల మధ్య అతుకుల బొంతగా వారి జీవితం గడుస్తోందన్నారు. సామాజిక బాధ్యతగా ఈ వృత్తినినిర్వహించే వీరి సమస్యలపై ఇప్పటికైనా అధికారులతో కాటికాపరి వృత్తిని ప్రభుత్వం వృత్తిగా గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు జాగ్గిలి రమేష్ మాట్లాడుతూ వృత్తి పరికరాలైన చెలక, పార, గౌజు, బూట్లు, హెడ్లైట్, తొడుగు కర్ర ఉచితంగా ఇవ్వాలన్నారు. కాటికాపరులకు ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. శ్మశానంలో డెత్ నమోదు చేసుకోవడానికి ఇద్దరికి పర్మనెంట్ ఉద్యోగం కల్పించాలి కోరారు. ధర్నా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పనిగంటల పెంపుతో పెరగనున్న శ్రమదోపిడీ

గార్మెంట్స్ పరిశ్రమల విధులు నిర్వహిస్తున్న కార్మికులు

ఓ పక్క పని ఒత్తిడి....మరో పక్క శ్రమదోపిడీ
అనారోగ్యాలకు దారితీసే పరిణామం
పోరాటాలకు సిద్ధమవుతున్న కార్మిక వర్గం

ప్రజాశక్తి-హిందూపురం

శ్రామిక వర్గాన్ని దోపిడీ చేసేందుకు కూటమి ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ చట్టానికి అనుగుణంగా చంద్రబాబు కార్మికులకు పని గంటలను పెంచేలా అసెంబ్లీలో నిర్ణయం తీసుకోవడం శోచనీయమని కార్మిక వర్గం ఆందోళన వ్యక్తం చేస్తోంది. పని గంటల పెంపుతో కార్మికులపై ఒత్తిడి పెరిగే అవకాశాలు ఉన్నాయి. పని గంటలు పెరగడంతో నిరుద్యోగులకు ఉపాధి దొరక్క నిరుద్యోగం పెరిగే అవకాశాలు సైతం ఉన్నాయి. ప్రాణాలను సైతం త్యాగం చేసి సాధించుకున్న హక్కుల రక్షణ కోసం, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధమవుతోంది. పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గానికి అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని కార్మిక సంఘాల నేతలు హెచ్చరిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాగా ఉన్న అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలో 8 పారిశ్రామికవాడలు ఉన్నాయి. 1979లోనే అనంతపురంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పుడే ఇక్కడ పారిశ్రామికడను నెలకొల్పారు. అయితే 1985లో ఎన్టీఆర్ హాయంలో హిందూపురం రూరల్ మండలంలో ప్రత్యేక పారిశ్రామిక వాడను అభివృద్ధి చేశారు. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో 120 చిన్న, మధ్య భారీ తరహా పరిశ్రమలు ఉన్నాయి. దీంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 850 వరకు చిన్న, పెద్ద పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో సుమారు 30 వేల మంది పారిశ్రామిక కార్మికులు పని చేస్తున్నారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి కల్పనలో భాగంగా 20కి పైగా గార్మెంట్స్ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో దాదాపు 16వేల మందికి పైగా మహిళా కార్మికులు పని చేస్తున్నారు. అలాగే పెనుకొండ వద్ద ఉన్న కియా కార్ల పరిశ్రమలో సుమారు 5వేల మంది వరకు కార్మికులు పని చేస్తున్నారు. పనిగంటల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వీరందరిపైనా ప్రత్యక్షంగా పడుతుంది. భవన నిర్మాణ రంగ కార్మికులు, ఆటో డ్రైవర్లు, హమాలీలు, రవాణా రంగ కార్మికులు అసంఘటిత రంగంలో పని చేస్తున్నారు. వీరంతా సుమారు 3 లక్షల మంది దాకా ఉన్నారు. వీరందరిపైనా పని గంటల పెంపు భారం పరోక్షంగా పడుతుంది. అనేక మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని చంద్రబాబు 13 గంటలకు పెంచడంతో ఆయా సంస్థల యాజమాన్యాలు శ్రమదోపిడీ చేసే అవకాశం ఉంది. కూటమి ప్రభుత్వ నిర్ణయం వలన అదనపు పని గంటలు పనిచేస్తే అదనంగా ఒనగూరే ప్రయోజనం కార్మికులకు ఏమీ ఉండదు. వేతనాలు పెరగవు. ఇప్పటికే అరకొర వేతనాలతో రెక్కలు ముక్కలు చేసుకుని పనిచేస్తున్న కార్మిక వర్గం ఇక నుంచి 13 గంటలు గనుక పని చేస్తే మానసిక ఒత్తిడికి లోనై తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇదే అదునుగా యజమాన్యాలు కార్మికులతో గొడ్డు చాకిరీ చేయించే అవకాశం ఉంది. ఇప్పటికే 8 గంటల పని దినాలకు బదులుగా అనేక చోట్ల, పలు పారిశ్రామిక సంస్థల్లో 10 గంటలకు పైనే కార్మికులతో పనులు చేయించుకుంటున్న పరిస్థితి ఉంది. రాష్ట్ర ప్రభుత్వమే పని గంటలను పెంచుతూ అధికారికంగా నిర్ణయం తీసుకోవడం వలన యాజమాన్యాలు కార్మికుల శ్రమను మరింతగా దోచుకునే అవకాశం ఉంది.

మోడీ ప్రసన్నం కోసమే ... ప్రధాని నరేంద్ర మోడీని ప్రసన్నం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు కార్మికుల శ్రమను దోపిడి చేసి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్నారు. మోడీని ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్న చంద్రబాబు కార్మిక వర్గం నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతోంది. పని గంటల పెంపు వలన అనేక మంది నిరుద్యోగులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. దీని ప్రభావం వలన ప్రతి ముగ్గురిలో ఒకరు ఉద్యోగం కోల్పోతారు. ఇప్పటికే నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయిలో ఉంది. ఉద్యోగ అవకాశాలు కల్పించక పోగా ప్రభుత్వం అనేక మందిని ఇటీవల కాలంలో తొలగించింది. ఈ నేపథ్యంలో నిరుద్యోగ సమస్య మరింత జఠిలమవుతుంది. ఆకలి మంటతో నిరుద్యోగ యువత ప్రభుత్వంపై తిరగబడే అవకాశాలు ఉంటాయి. రాబోయే రోజుల్లో ఉపాధి అసాధ్యంగా మారుతుంది. ఆర్థిక, సామాజిక సంక్షోభానికి దారితీస్తుంది. పనిగంటల పెంపుతో కార్మికుల ఆరోగ్యంపై ప్రభావం, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. అధిక సమయం పని చేయడం వల్ల గుండె జబ్బులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బర్న్ అవుట్, డిప్రెషన్, ఆందోళనకు కారణమవుతాయనే అభిప్రాయాలను మానసిక వైద్య నిపుణులు వ్యక్తం చేస్తున్నారు.

శ్రమ దోపిడీకి బలం చేకూర్చారు

పరిశ్రమల నిర్వాహకులు ఇప్పటికే కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా అరకొర వేతనాలు ఇస్తున్నారు. కార్మికులను బానిసలకన్నా హీనంగా చూస్తూ వారితో ఇప్పటికే 12 గంటలు పని చేయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టంతో శ్రమ దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది. వెంటనే ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేనిపక్షంలో కార్మికులందరిని కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

ఈఎస్ వెంకటేష్,
సిఐటియు జిల్లా అధ్యక్షులు

వెనక్కి తీసుకోకపోతే ఉద్యమిస్తాం

కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం రద్దు చేయాలి. మహిళలతో రాత్రి వేళలో పని చేయించడం మానుకోవాలి. ఏ రంగంలో పనిచేసే కార్మికుని కైనా కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలి. హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోలాపురం పారిశ్రామికవాడలో ఉన్న స్టీల్ పరిశ్రమల్లో ఇప్పటికే కార్మికులతో 12 గంటలు పని చేయిస్తూ శ్రమను దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే కార్మిక వర్గంతో కలిసి ఆందోళన కార్యక్రమాలను చేపడతాం.

రవికుమార్,
తూమకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు

మానవ సంబంధాలను కోల్పోతారు

కార్మిక హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలి. కార్మికులు పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే ఇంటి పని చేస్తూ, కుటుంబ పోషణ కోసం బయట పనిచేసే పరిస్థితుల్లో అదనపు పనిభారాన్ని మహిళా కార్మికులపై వేసే విధంగా తీర్మానం చేయడం దుర్మార్గం. ఇది అమలైతే మహిళలు కుటుంబంతో గడిపే సమయం, మానవ సంబంధాలను కోల్పోయే పరిస్థితి దాపురిస్తుంది. ఔ

సావిత్రమ్మ
ఐద్వా రాష్ట్ర నాయకురాలు

వలస కార్మికుడి కుటుంబానికి నష్టహారం చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

రాప్తాడు ట్రాన్స్‌కో నిర్లక్ష్యం కారణంగా మృతిచెందిన వలస కార్మికుడి కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్‌వి నాయుడు, కోశాధికారి నాగమణి, జిల్లా సహాయ కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు కార్మికుడి మృతికి కారణమైన రాప్తాడు ట్రాన్స్‌కో ఎఇ, కాంట్రాక్టర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని జిల్లా విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 20న రాప్తాడు మండలం హంపాపురం సబ్‌స్టేషన్ పరిధిలో 33 కెవి లైన్ మరమ్మతుల కోసం కాంట్రాక్టర్ గోపాల్ ఎల్‌సి తీసుకుని మరమ్మతులు చేస్తుండగా ఎఇ నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సరఫరా కావడంతో వలస కార్మికుడు ఎస్‌కె బషి మృతిచెందాడన్నారు. దీంతో ఆయన కుటుంబం వీధిన పడే అవకాశం ఉందన్నారు. కావున వెంటనే విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి మృతిచెందిన కార్మికుడి కుటుంబానికి రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తిరుపతి హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా చేయనున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బాలరంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి.ప్రసాద్, సిఐటియు రాప్తాడు మండల నాయకులు పోతలయ్య, చెన్నప్ప, బూసప్ప, శంకర్, ఇమామ్, ఎర్రిస్వామి, కాశయ్య, సిద్ధు, ఇశ్రాయేలు, విజయ, నరసింహులు, ఆదెప్ప, నాగన్న, నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

గోల్డెన్ అవర్ లో 3,450 మంది ప్రాణాలను కాపాడాం
రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అనంతపురం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం అనంతపురం నగరంలోని శారదా నగర్ లో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో నిర్వహించిన వరల్డ్ హార్ట్ డే - 2025, కార్డియాలజీ విభాగం ఆధ్వర్యంలో 100 ఇమేజ్ గైడెడ్ పీసీఐ(ఐవియుఎస్), 500 యాంజియోప్లాస్టీ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా నిర్వహించిన సంబరాల్లో మంత్రితో పాటు కలెక్టర్ ఓ.ఆనంద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా.విజయశ్రీ, జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.కెఎల్.సుబ్రహ్మణ్యం, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జున రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డా.బెనేడిక్ట కోఇల్హో తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గుండెచప్పుడు ఆగకుండా విశేషమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ల సమాజానికి వరల్డ్ హార్ట్ డే శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా గుండె జబ్బులు కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య 20 శాతంగా ఉందని, అయితే 80 శాతం నివారించదగ్గ జబ్బు ఇదని, ఆహారపు అలవాట్లు, జీవనశైలిలో మార్పులు చేసుకుంటే గుండె జబ్బు బారిన పడకుండా ఉండే అవకాశం ఉందన్నారు. మన రాష్ట్రంలో కూడా వస్తున్న వ్యాధుల్లో 18 నుంచి 22 శాతం గుండె జబ్బులకు సంబంధించినవి అని, మరణాలు కూడా దీని కారణంగా జరుగుతున్నాయని అన్నారు. దీనికోసం విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. గత 15 నెలలుగా 1 లక్ష 42 వేల మందికి డా.ఎన్టీఆర్ వైద్య సేవ కింద గుండె జబ్బులకు సంబంధించిన వ్యాధులకు చికిత్స అందించడం జరిగిందని చెప్పారు. గోల్డెన్ అవర్ లో ప్రాణాలు పోకుండా ఉండేందుకోసం 175 సి.హెచ్.సిలలో, 54 ఏరియా హాస్పిటల్ లలో, 9 జిల్లా ఆస్పత్రులలో 45 వేల రూపాయలు విలువ చేసే కెనెక్టివ్ ప్లేజ్ అనే ఇంజక్షన్ ని ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. ఈ స్టెమీ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 15 నెలలుగా ప్రారంభించిన నాటి నుండి 3,450 మంది ప్రాణాలను గోల్డెన్ అవర్ లో కాపాడడం జరిగిందని వివరించారు. ఏడాది కిందట అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఇంట్రా వ్యాస్కులర్ అల్ట్రా సౌండ్ ని కియా వారి సహకారంతో అధునాతన ఎక్విప్మెంట్ ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేదలకు నాణ్యమైన, ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందించే ప్రయత్నం జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ద్వారా జరిగిందని చెప్పారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధికి జిల్లా యంత్రాంగం నుంచి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం మంత్రి, జిల్లా కలెక్టర్‌ను జిజిహెచ్ సూపరింటెండెంట్, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటర్ తదితరులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డా.సుభాష్ చంద్రబోస్, డిసిహెచ్‌ఎస్, డాక్టర్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగులు

అధికారిక వాట్సప్ గ్రూపు నుంచి
సచివాలయ ఉద్యోగుల నిష్క్రమణ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ జెఎసి పిలుపు మేరకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం అధికారిక వాట్సప్ గ్రూపు నుంచి వైదొలిగారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డి.సుధాకర్, లక్ష్మీనారాయణ, వరప్రసాద్, మల్లికార్జున, విమల మాట్లాడుతూ తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఇంటింటికీ తిరిగి క్యాంపెయినింగ్‌ను తమకు అప్పగించరాదన్నారు. అలాగే తమకు రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలల అరియర్స్ ఇవ్వాలన్నారు. ఆరేళ్లు పూర్తి చేసుకున్న ప్రతి సెక్రటరీకి ఎఎస్ ఇంక్రిమెంట్‌ను వర్తింపజేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలు పరిష్కరించాలని తాము సామరస్యంగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. తమ సమస్యలపై స్పష్టమైన ప్రకటన వచ్చేంత వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సిరాల చంద్ర, శివశంకర్, రామకృష్ణ, మల్లికార్జునరెడ్డి, విజయ్, సాయిప్రతాప్, నాగేంద్ర, ప్రసన్నలక్ష్మి, సునీత, శిరీషా, తదితరులు పాల్గొన్నారు

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

రాయదుర్గం : అత్యవసర పరిస్థితుల్లో కార్పొరేట్, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న పలువురికి మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను విప్ కాలవ శ్రీనివాసులు సోమవారం రాయదుర్గంలోని స్వగృహంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు హనుమంతు, కణేకల్ మండల అధ్యక్షులు లాలెప్ప, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేరువగా
డిసిఎంఎస్ సేవలు

మహాజన సభలో ఛైర్మన్ నెట్టెం వెంకటేశులు

ప్రజాశక్తి-అనంతపురం

మాట్లాడుతున్న డిసిఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేశులు

జిల్లాలోని గ్రామస్థాయిలో రైతులకు విత్తనాలు, రసాయనిక ఎరువులు, పురుగుల మందులు అందించేందుకు డిసిఎంఎస్ ప్రణాళికలు రూపొందిస్తోందని ఛైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. సోమవారం నగరంలోని డిసిఎంఎస్ కార్యాలయ ప్రాంగణంలో డిసిఎంఎస్ ఏర్పడి 68ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహాజన సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించేందుకు డిసిఎంఎస్ కృషి చేస్తోందన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో రైతులకు అవసరమైన డిసిఎంఎస్ గోడౌన్లను ఏర్పాటు చేయడానికి ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 50 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా స్పందించిందన్నారు. తాను ఛైర్మన్‌గా బాధ్యత తీసుకున్న మూడునెలల కాలంలో రైతులకు సమస్యలు రాకుండా ఎరువులు పంపిణీచ ఏశామన్నారు. ముఖ్యంగా యూరియా కొరత లేకుండా రైతులకు అందిస్తున్నామన్నారు. అనంతరం ఛైర్మన్ అనుమతితో డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్ ప్రతిపాదించిన సంఘం ఆడిట్ రిపోర్టు 2023-24ను, పిఎసి కమిటీ ఆమోదించిన సంఘం జమా ఖర్చులకు మహాజన సభ ఆమోదం తెలిపింది. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ ముండిమడుగు కేశవరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పిఎసిఎస్ ఛైర్మన్లు, డిసిఎంఎస్ బిజినెస్ బిజినెస్ మేనేజర్ విజయభాస్కర్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, అకౌంట్ అధికారి సుధాకర్‌రెడ్డి, డిసిఓ కార్యాలయ సూపరింటెండెంట్ మునికృష్ణారెడ్డి, సభ్యులు అనిల్‌కుమార్‌రెడ్డి, రంగన్నచౌదరి, మల్లికార్జున, డిసిఎంఎస్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో పురోగతి సాధించాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం

లక్ష్యసాధనలో భాగంగా ఆయా శాఖల అధికారులు పురోగతి సాధించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో పిజిఆర్ఎస్, ఉపాధి హామీ, ఎన్టీఆర్ పెన్షన్లు, హౌసింగ్, తదితర అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్న నేపథ్యంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా సంబంధిత శాఖ అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే జిల్లాకేంద్రంలో ఉన్న పీజీఆర్ఎస్ విభాగం సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. జిల్లాలోని పలు మండలాల్లో రెవెన్యూ, సర్వే, మున్సిపల్ తదితర శాఖలకు చెందిన అంశాలకు సంబంధించి అర్జీలు పదే పదే వస్తున్నాయని, ఇకపై మండల స్థాయిలోనే వాటిని పరిష్కారం చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ జరిగే సమయంలో డివిజన్, క్షేత్రస్థాయి అధికారులు ఆయా ప్రధాన కేంద్రాల నుంచి హాజరు కాలవాలన్నారు. డివిజన్, మండల స్థాయిలో చాలావరకు రీఓపెనింగ్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని వాటిని పూర్తి చేయాలన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులందరికీ పనులు కల్పించి లేబర్ బడ్జెట్ సాధించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల్లో క్షేత్రస్థాయి పనుల పర్యవేక్షణతోపాటు మస్టర్ తనిఖీ చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. 30శాతం లోపు తక్కువ ఉన్న మండలాలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు మండలాల్లో చాలా తక్కువగా నివేదికలు ఉన్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ సలీం, డిఆర్‌డిఎ పీడీ శైలజ, ఎపిఎంఐపి పీడీ రఘునాథ్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి-యల్లనూరు

నీటితో నిండిపోయిన అంగన్వాడీ కేంద్రం

మండల పరిధిలోని జంగంపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరింది. గతంలో సర్వశిక్షా అభియాన్ నిధులతో పాఠశాల భవనాన్ని నిర్మించారు. అయితే విద్యార్థుల లేక ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పాఠశాల మూతబడింది. అప్పటి నుంచి స్త్రీశిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రానికి ఉపయోగిస్తున్నారు. అంగన్వాడీ పక్కనే గ్రామ పంచాయతీ తాగునీటి ట్యాంకు ఉంది. ట్యాంకు నీటితో నిండిన తర్వాత ఓవర్ ఫ్లో అయ్యే నీళ్లన్నీ అంగన్వాడీ కేంద్రం ప్రాంగణంలోకి వెళ్లి పిల్లలు వెళ్లడానికి వీలు లేకుండాపోతోంది. అంతేగాకుండా పునాదుల్లోకి నీరు వెళ్లి కుంగే ప్రమాదం ఉంది. భవనం కూడా శిథిలావస్థకు చేరి ప్రమాదానికి గురవుతోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి ట్యాంకు నీరు అంగన్వాడీ పరిసరాలకు వెళ్లకుండా చేయడంతోపాటు అంగన్వాడీ కేంద్రానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐ మిత్రా విజన్ సెంటర్ సౌజన్యంతో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని 6వ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, ఐ మిత్ర విజన్ సెంటర్ వ్యవస్థాపకాలు పులిపాటి గోపాల్, ఐ మిత్ర విజన్ సెంటర్, కో ఆర్డినేటర్ నాగరాజు ప్రారంభించారు. ఇందులుఓ భాగంగా పేదలకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి శుక్లాలు అవసరమైన 10మందికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని ఐ మిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులు అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఐమిత్ర విజన్ సెంటర్ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు జీవా, 42 డివిజన్ శాఖ కార్యదర్శి సోడాల వెంకటేష్, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రామాంజనేయులు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

ప్రజాశక్తి-రాయదుర్గం

సమాచార హక్కు చట్టం ఏర్పాటై రెండు దశాబ్దాలు పూర్తి కావస్తున్న సందర్భంగా ఇండియన్ యాక్ట్ అవేర్నెస్ వాలంటరీ ఆర్గనైజేషన్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గంలో సమాచార హక్కు చట్టం వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగరాజు, పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ ఇన్‌స్పెక్టర్ జయనాయక్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో కోర్టు సూపరింటెండెంట్ రామాంజనేయులు పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్‌బాబు, రాయలసీమ రీజన్ ఛైర్మన్ వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాపల్లి గోపాల్, ప్రేమ్, నరసింహ, శ్రీనివాసులు, సిద్ధప్ప ఈశ్వర్ రెడ్డి, లోకేష్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ'పై అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-పుట్లూరు

ప్రతి ఒక్క వినియోగదారునికీ జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించాలని డిప్యూటీ ఎంపిడిఒ శివప్రసాద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొచ్చిన జీఎస్టీ ధరల తగ్గుదలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీలైనంతగా జీఎస్టీ శాతం తగ్గింపులతో ప్రతి కుటుంబంలో అవసరమైన సరుకులను కొని లబ్ధి పొందవచ్చునన్నారు. ముఖ్యంగా సూక్ష్మసేద్యం చేసే రైతులకు డ్రిప్పు, స్ప్రింక్లర్ల పరికరాలపై 12 శాతం నుంచి ఐదు శాతానికి జీఎస్టీని తగ్గించినట్లు తెలిపారు. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా ఎలక్ట్రికల్ పరికరాలపై 28 నుంచి 18 శాతానికి తగ్గిందన్నారు. వీటన్నింటిపై మారుమూల వినియోగదారునికి సైతం అవగాహన కల్పించే విధంగా కమర్షియల్ టాక్స్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన 'డేగల'

కలెక్టర్‌ను సన్మానిస్తున్న డేగల కృష్ణమూర్తి

శింగనమల : ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఓ.ఆనంద్‌ను టిడిపి అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి సోమవారం ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఇస్మాయిల్ ఆజాద్, తదితరులు ఉన్నారు.

హక్కులు, చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రజలతో మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

మండల పరిధిలోని హరేసముద్రం గ్రామంలో ఉన్న ఆర్డీటీ పాఠశాలలో సర్పంచు తిప్పేస్వామి ఆధ్వర్యంలో చట్టాలు, హక్కులు, బాధ్యతలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మునివేలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐ నబిరసూల్ రోడ్డు ప్రమాదాలు, భద్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రవితేజ, బాలకృష్ణ, ప్రజలు పాల్గొన్నారు.

'డ్రగ్స్ వద్దు బ్రో'

రైల్వేస్టేషన్‌లో ఈగల్ టీమ్ తనిఖీలు

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-అనంతపురం

'డ్రగ్స్ వద్దు బ్రో' డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉందామని పోలీసులు పిలుపునిచ్చారు. ఎస్పీ జగదీష్ సూచనలు మేరకు, సోమవారం అనంతపురం రైల్వేస్టేషన్ పరిధిలో 'డ్రగ్స్ వద్దు బ్రో' అంటూ పోలీసులు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైల్వే సిబ్బంది, ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, వ్యాపారులకు డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక సమస్యలతోపాటు ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం అమలు చేసే శిక్షల గురించి వివరించారు. అంతేగాకుండా 'డ్రగ్స్ వద్దు బ్రో-లైఫ్ అంటే ఒక అవకాశం, దాన్ని వృథా చేసుకోకండి' అనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు, ప్లాట్‌ఫాం ప్రాంతం, రైల్వే పరిసరాల్లో నిషేధిత పదార్థాలు రవాణా జరుగుతుందేమోనని సవివరంగా చేశారు. ఈ కార్యక్రమంలో తనిఖీల్లో ఈగల్ టీమ్, జిఆర్‌పి పోలీసులు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

'అశ్వర్థం' పాలకమండలి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండలంలోని అశ్వర్థ నారాయణస్వామి ఆలయ పాలకమండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డితోపాటు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌ఛార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ లోకనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ నూతన కమిటీ సభ్యులు

డిజిటల్ బుక్‌లో 'కూటమి' అరాచకాలు

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం..-'క్యూఆర్ కోడ్' ఆవిష్కరణలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలోని కూటమి నాయకులు అరాచకాలు, అన్యాయాలను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి తాము అధికారంలోకి వచ్చాక చర్యలు తీసుకుంటామని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో కార్యకర్తల కోసం నూతనంగా తీసుకొచ్చిన డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు ఎల్ఎం మోహన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి హయాంలో విద్య, వైదానికి పెద్దపీట వేస్తే.. నేడు కూటమి ప్రభుత్వం కుట్రలకు కేరాఫ్‌గా మారిందని విమర్శించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు కూటమి ప్రభుత్వ అన్యాయాలపై ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారన్నారు. కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వెంటనే డిజిటల్ బుక్‌లో రిజిస్టర్ చేస్తే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసులన్నీ మాఫీ చేయడంతోపాటు కేసులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు ఉంటాయన్నారు. అంతేగాకుండా కూటమి అరాచక పాలనను సమిష్టిగా ప్రజల్లోకి తీసుకెళ్తూ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు. ఇకపోతే జగన్‌ను విమర్శించే స్థాయి హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, గువ్వల పెద్ద వెంకటరెడ్డి, జడ్పిటిసి భాస్కర్, బుక్కరాయసముద్రం సర్పంచు పార్వతి, ఎంపిటిసిలు కాలవ వెంకటలక్ష్మి, వెంకట శివారెడ్డి, నాయకులు పూల నారాయణస్వామి, కాలవ నారాయణస్వామి, బయపరెడ్డి, వడియంపేట అంజనేయులు, వరకూటి కాటమయ్య, ముత్యాల శీనా, గాంధీనగర్ ఆదినారాయణ, పూలరంగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో వైసిపి నాయకులు డిజిటల్ బుక్ పోస్టర్లకు సంబంధించి క్యూఅర్ కోడ్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకులు కోనా మురళీధర్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా మాట్లాడుతూ కూటమి నాయకుల అన్యాయానికి గురైన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఫోన్ నెంబర్ 040-49171718 ద్వారా డిజిటల్ బుక్ లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వి.వరదరాజులు, వాల్మీకి శివ, వెంకటరమణ, వైసిపి నాయకులు సివి.రంగారెడ్డి, దస్తగిరి, చంద్రగిరి రాధా యాదవ్, వై.సుభాష్ రెడ్డి, మైనుద్దీన్, ఎం.రంగస్వామి, మార్తాడు అన్సర్, డి.షఫీ, గోపీనాథ్‌రెడ్డి, మల్లికార్జున, కుమార్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో క్యూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

పామిడి : రాష్ట్రంలో కూటమి పాలన సూపర్‌హిట్ అయిందని సంబరాలు చేసుకోవడం దురదృష్టకరమని వైసిపి ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి పెమ్మక చెన్నకేశవరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో డిజిటల్ బుక్‌కు సంబంధించిన కూఆర్ కోడ్ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చెన్నకేశవరెడ్డి, సునీల్‌రెడ్డి, పార్వతీశ్వర్‌రెడ్డి, నాగూరు ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, దామోదర్‌రెడ్డి, సాకే ఓబులేసు, నారాయణస్వామి, కృష్ణానాయక్, ముత్యాలరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పరదేశి అనిల్, నాగేష్‌యాదవ్, దేవేంద్రయాదవ్, రామచంద్ర, సుధాకర్, శివ, సూర, వెంకటేష్, ఎద్దులపల్లి ప్రసాద్, మెకానిక్ రామాంజి, యల్లప్ప, వెంకట్, వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను వైసిపి నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి కంభం చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు మహాదేవప్ప, గోపాల్‌రెడ్డి, మహేష్‌స్వామి, గంగాధర్, నాగభూషణ, ఏసఫ్, రాము, తిమ్మారెడ్డి, వైఎస్ఆర్ శరణప్ప, ఉమేష్, యు.మహాలింగ, శంకర్‌నాయక్, మంజు, గోవిందు, మహాత్మ, నాగిరెడ్డి, నీల స్వామి, మంతేష్, గోపాల్, మంజునాథ్, లింగన్న, వన్నూర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

అంతర్జాతీయ గుండె దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు

ప్రజాశక్తి-అనంతపురం

వయసుతో సంబంధం లేకుండా గుండె సమస్యలు అధికమవుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు. అంతర్జాతీయ గుండె దినోత్సవాన్ని పురస్కరించుకుని కిమ్స్ సవీరా ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కన్సల్టెంట్ కార్డియాలజిస్టులు సందీప్, స్పందన మాట్లాడుతూ జీవనశైలిలో భాగంగా చాలమంది యువత ఇంటికే పరిమితం అవుతోందన్నారు. ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీల ముందు కూర్చుని కాలక్షేపం చేస్తున్నారు తప్ప పార్కులకు వెళ్లడంగానీ, వ్యాయామాలుగానీ చేయడం లేదన్నారు. గత కొన్నేళ్లుగా వయసుతో తేడా లేకుండా పుట్టిన శిశువు నుండి పెద్దవారికి వరకు గుండె సమస్యలు వస్తున్నాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయడం తమ దినచర్యలో భాగంగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవీరా సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బాలకిషోర్, కిమ్స్ సవీరా రీజినల్ సిఒఒ సిద్ధారెడ్డి, కిమ్స్ సవీరా వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. మెడికల్ కళాశాల నుంచి ప్రారంభించిన ర్యాలీ సప్తగిరి సర్కిల్ వరకూ సాగి తిరిగి మెడికల్ కళాశాలకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయశ్రీ, సూపరింటెండెంట్ కెవెల్ సుబ్రమణ్యం, డిప్యూటీ సూపరింటెండెంట్ బెనెడిక్ట్ హాజరై గుండె సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్టులు సుభాష్ చంద్రబోస్, గణేష్, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ శంషాద్‌బేగం, వైద్యులు తెలుగు మధు, శంకర్, డిప్యూటీ ఆర్ఎంఒ డాక్టర్ హేమలత, హెచ్‌ఒడిలు భీమసేనాచారి, భాస్కర్, వేముల శ్రీనివాసులు, ఆత్మరామ్, రవికుమార్, శాంతిరెడ్డి, శివశంకర్‌నాయక్, పద్మ శ్రావణి, రవితేజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, హెల్త్ ఎడ్యుకేటర్ రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్, 'ఇందిరమ్మ' నోటీసులపై రాయదుర్గం కౌన్సిల్‌లో రచ్చ

ప్రజాశక్తి-రాయదుర్గం

కౌన్సిల్ సమావేశంలో నిలదీస్తున్న సభ్యులు

పట్టణ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రెండోసారి అధికారులు నోటీసులు జారీ చేయడం, పురపాలక సంఘం పరిధిలో అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడంపై పలువురు సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప అధ్యక్షతన సోమవారం స్థానిక కౌన్సిల్ హాల్లో సాధారణ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య పలు అంశాలపై వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా వైసిపి కౌన్సిల్ సభ్యులు గోవిందరాజులు, అజయ్ కుమార్, శ్రీనివాసులు మాట్లాడుతూ అధికారిక సమావేశాలు, సభలు నిర్వహించినప్పుడు మున్సిపల్ అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు. ఈ విషయమై పలుసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇటీవల మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కు సభావేదికపై సీటు లేకపోవడమే ఇందుకు ఉదాహరణగా చూపారు. ఈ విషయమై కమిషనర్ దివాకర్‌రెడ్డి సమాధానం ఇస్తూ మెప్మా నిర్వహించిన శిబిరానికి తాను అతిథిగా వెళ్లానని కమిషనర్ తెలిపారు. ఇకనుంచి ఎవరైనా మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రొటోకాల్ పాటించకపోతే తన దృష్టికి తీసుకొస్తే చర్య తీసుకుంటానన్నారు. అలాగే వైసిపికి చెందిన పాలకమండలి సభ్యులు పట్టణంలోని వార్డుల్లో పర్యటనలు చేస్తే టిడిపికి చెందినవారు అడ్డుకోవడం సమంజసం కాదని ఛైర్‌పర్సన్ అన్నారు. ఎవరి అభిప్రాయాన్ని వారు ప్రజలకు తెలియజెప్పే స్వేచ్ఛ ఉందన్నారు. సభ్యులు గోవిందరాజులు, అజయ్‌కుమార్ మాట్లాడుతూ గతంలో 2007-08లో అనేకమంది పేదలకు పట్టాలు ఇవ్వడంతోపాటు పక్కా ఇల్లు మంజూరయ్యాయన్నారు. అయితే వివిధ కారణాల రీత్యా కొందరు లబ్ధిదారులు కేవలం పునాదులు, బేస్‌మట్టం మాత్రమే వేసుకున్నారన్నారు. అలాంటి వారికి అధికారులు రెండోసారి నోటీసులు ఇవ్వడం సరైంది కాదన్నారు. తర్వాత కమిషనర్ మాట్లాడుతూ రెవెన్యూ, గృహ నిర్మాణ సంస్థ అధికారులతో చర్చించి వాటిపై స్పష్టమైన వివరణ ఇస్తామన్నారు. జీరో అవర్‌లో సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో అనేకచోట్ల తగినన్ని వీధిదీపాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికితోడు దోమల బెడద అధికంగా ఉందని, పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అజెండాలోని ఒక అంశం మినహా ఇతర అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

సభ్యత్వం తీసుకుంటున్న సభ్యులు

ఎపి ఎన్‌జిఒ సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఎపి ఎన్‌జిఒ భవన్‌లో నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదును ప్రారంభమైంది. ఈ సందర్భంగా నగర అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు కలిసి మొదటగా ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాధవ్ తొలి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, మహిళా వింగ్ జిల్లా ఛైర్మన్ జమీలాబేగం, కమర్షియల్ టాక్స్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్‌బాబు, అగ్రికల్చర్ ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెద్దన్నగౌడ్, ఆర్టీసీ ఎంప్లాయీస్ ఛైర్మన్ సూరిబాబు, ఎస్‌టియు టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు నాయకులు మహేశ్వర్‌రెడ్డి, శ్యామ్ సుదర్శన్, నర్సింగ్ అసోసియేషన్ నుంచి నారాయణస్వామి, నగర శాఖ నాయకులు విష్ణువర్ధన్, రామ్‌నాథ్‌రెడ్డి, దామోదర్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, తదితరులు సభ్యత్వం తీసుకున్నారు.

13న 'సేవ్ ఆర్డీటీ' దీక్ష

నార్పల : సేవ్ ఆర్డీటీ-సేవ్ అనంత నినాదంతో వచ్చేనెల 13వతేదీన అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు భారతీయ భీమ్ సేన నార్పల కమిటీ వ్యవస్థాపకులు జైభీమ్ రామాంజనేయులు తెలిపారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా అధ్యక్షులు రాయల్ అమ్మిలి భాగ్యలక్ష్మి, జిల్లా అధ్యక్షులు బంధం రమేష్, బిబిఎస్ యూత్ కమిటీ రామ్‌సింగ్, రాజు, వార్డ్ మెంబర్ నిమ్మకాయల రాము, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో స్పష్టత కరువు

ప్రజాశక్తి-యల్లనూరు

యూరియా కోసం గుంపుగుంపులుగా ఉన్న రైతులు

సహకార సొసైటీ ద్వారా సోమవారం పంపిణీ చేసిన యూరియాపై గందరగోళమే కొనసాగింది. రెండు రోజులు ముందు 12.5 మెట్రిక్ టన్నుల యూరియా సొసైటీకి వచ్చింది. అయితే వ్యవసాయ అధికారి అనారోగ్యం కారణంగా పంపిణీ జరగలేదు. ఓ పక్కన జిల్లా అధికారులు నానో యూరియా వాడకాన్ని పెంచేందుకు డ్రోన్ పిచికారీతో పైలెట్ ప్రాజెక్టు నిర్వహిస్తున్నా.. రైతులు అందుకు సిద్ధంగా లేరని స్పష్టం అవుతతోంది. ఎందుకంటే యూరియా బస్తా రూ.267కే వస్తుంది. నానో యూరియా పిచికారీ చేయాలంటే లీటర్‌కు రూ.500 నుంచి 600 వరకూ ఖర్చు అవుతుంది. దీంతో యూరియాపైనే రైతులు ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సొసైటీకి కాకుండా ఆర్ఎస్‌కెల ద్వారా యూరియాను పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

యువరైతు కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆత్మకూరు : ఇటీవల ఆత్మహత్య చేసుకున్న యువరైతు కుంటెన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కుటుంబీకులు వేడుకున్నారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంటెన్న పంటలు సాగు చేసి పెట్టుబడులకు రూ.లక్షల్లో అప్పులు చేశాడన్నారు. పంట దిగుబడులు రాకపోవడంతో అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున కుంటెన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో రైతు కుటుంబీకులు నాగరాజు, బేల్దారి ఓబుళపతి, ఎర్రమ్మ, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఎడిఎ రవికి వినతిపత్రం అందజేస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు

రవి సీజన్‌కు వాతావరణం అనుకూలించిన నేపథ్యంలో 90 శాతం సబ్సిడీతో విత్తనాలు ఇవ్వాలని ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులతో కలిసి సోమవారం తాడిపత్రి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలు సకాలంలో రావడంతో రైతులు విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రైతులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సబ్సిడీ విత్తనాలను ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వీటితోపాటు అవసరమైన ఎరువులను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం కమిటీ సభ్యులు శిరీషా, రైతులు వీరరాఘవరెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి డిబేట్‌లో బెలుగుప్ప విద్యార్థినుల ప్రతిభ

ప్రతిభ కనబరిచిన విద్యార్థినులు

బెలుగుప్ప : పాఠశాల విద్యాశాఖ, వారిధి ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించిన 'సోషల్ మీడియా వల్ల లాభాలు, నష్టాలు'పై జిల్లాస్థాయి డిబేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మేఘనాబాయి ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకటప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేఘనాబాయి, ఐశ్వర్య మాట్లాడుతూ మండల విద్యాశాఖ అధికారులు పి.మల్లారెడ్డి, హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్ ప్రోత్సాహంతోనే జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

యాడికి : గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న వార్డు సభ్యులు, పారిశుధ్య కార్మికులకు దసరా పండగ పురస్కరించుకుని తూట్రాలపల్లి గ్రామ సర్పంచ్ సంజీవ రాయుడు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు చేస్తున్న సేవలను గుర్తింపుగా చిన్నసాయం చేసినట్లు తెలిపారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

బెలుగుప్ప : ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ కార్తీక్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్వస్థనారి స్త్రీశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఆవులెన్న గ్రామంలో ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామ్మోహన్‌చౌదరి, డాక్టర్ రిషికేశ్, సూపర్‌వైజర్ వెంకటరమణ, సరోజమ్మ, ఆశావర్కర్లు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

గుంతకల్లు : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, టిడిపి మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు నారాయణస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపా జగదీష్, కార్యదర్శి కందూరి కృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ముక్కన్నగారి గుణశేఖర్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులను నిరాశపరిచిన అసెంబ్లీ సమావేశాలు

అనంతపురం సిటీ : ఉద్యోగుల ఆర్థిక బకాయిలపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఆమోదయోగ్యమైన పరిష్కారం దక్కుతుందని ఎదురుచూసిన ఉద్యోగులందరికీ తీవ్ర నిరాశ కలిగిందని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. దసరా కానుకగా పెండింగ్‌లో ఉన్న 4 కరువు భత్యాల్లో కనీసం రెండు అయినా ఇస్తారని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించి ఉద్యోగులందరికీ ఇంటీరియం రిలీఫ్ ప్రకటిస్తారని ఆశించారన్నారు. ఆఖరికి అసెంబ్లీలో ప్రకటించిన ఉద్యోగుల కరువుభత్యం, 11వ పిఆర్‌సి బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారో చెప్పకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా సిఎం చంద్రబాబు స్పందించి ప్రభుత్వం, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ఎన్నో ఒత్తిళ్లను అధిగమించి ప్రజలకు చేరవేస్తున్న ఉద్యోగుల ఆర్థిక అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు.

అధికారమిచ్చింది పనిగంటలు పెంచడానికేనా..?

గుంతకల్లు : రాష్ట్రంలోని కార్మికులంతా ఓట్లేసి కూటమి ప్రభుత్వాన్ని గెలిపించింది పని గంటలు పెంచడానికేనా.. అని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి బి.సురేష్ మండిపడ్డారు. శాసనసభలో బిల్లు ఆమోదం చేసిన 13 గంటల పని విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు పట్టణ కార్యదర్శి రామాంజినేయులు, జిల్లా కమిటీ సభ్యులు జిలాన్, రామదాసు, గోపీ, నారాయణ, బాషా, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో దుర్గాష్టమి వేడుకలు

పూజలు చేస్తున్న జెఎన్‌టియు విసి

అనంతపురం : నగరంలోని జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో సోమవారం దుర్గాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపకులపతి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య దుర్గామాత పూజ చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, వైశాలి ఘోర్పడే, నాగప్రసాద్ నాయుడు, జి.ప్రశాంతి, ఆర్.కిరణ్మయి, విబి చిత్ర, పి.సుజాత, సురేష్‌బాబు, సి.శోభాబిందు, సుబ్బారెడ్డి, బి.దుర్గాప్రసాద్, పద్మసువర్ణ, ఎపి శివకుమార్, బి.చంద్రమోహన్‌రెడ్డి, పిఆర్ఒ బి.ఓంప్రకాష్, డిఇ డిపి.లక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఎం.రామశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సెక్టార్ సమావేశం

యల్లనూరు : మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజామణి ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీ సిబ్బందికి సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సంపూర్ణ పోషణ, పిల్లల పెరుగుదల, గర్భిణుల ఆరోగ్య పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యల్లనూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ అంగన్వాడీలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టేషన్ పరిసరాలు, కేసుల పురోగతి, పెండింగ్, సైబర్, చోరీ, సివిల్, రికవరీ కేసులపై ఆరాతీశారు. తర్వాత రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ సత్యబాబు, ఎస్ఐ రామాంజనేయరెడ్డి, ఏఎస్ఐ నారాయణరెడ్డి, జమేదార్లు, పోలీసులు పాల్గొన్నారు.